# దేవుడు మేలు చేయుగాక

అది మే 4.1.80 ఒకటిన్నర అయింది. బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ రాడానికి యింకా 2 గంటలు ఉంది. మేమిద్దరం ఒక ప్రత్యేకమయిన ఆతృతతో మద్రాసు స్టేషన్‌లో ఎదురు చూస్తున్నాం. ఆయన బాగా చదువుకున్నవాడు.

ఇద్దరూ ఒకే వృత్తి చేస్తున్నాం. ఒకే పత్రిక ఆఫీసులో పని. నేను 27. అతను 50. నేను వైవాహిక జీవితానికి మొదటి దశలో ఉన్నాను. ఆయన ఆఖరి దశలో. జీవితంలో ఒడుదుడుకులను ఎదుర్కొని ఎదుర్కొని అలసి పోయాడు.

గత నెలరోజులుగా అతనిలో ఏదో తెలీని మార్పుని గమనించాను. మనిషి చాలా మారిపోయాడు. తన ఆధీనంలో తను లేనట్టున్నాడు. మనస్సు చెదిరిన మనిషిలాగ తిరుగుతూండేవాడు. ఎప్పుడేనా బుద్ధిపుడితే అన్నం తింటున్నాడు. లేకపోతే రోజులకొద్దీ మెతుకయినా ముట్టుకోడం లేదు. ఒక్కోసారి గ్లాసు తర్వాత గ్లాసు నీళ్ళు తాగుతాడు. మరోసారి గొలుసు కట్టుగా సిగరెట్లు కాలుస్తాడు. మనిషి దిగజారినట్లు నైరాశ్యంతో కనిపిస్తున్నాడు. కారణం ఏమిటో ఎవరితోనూ చెప్పలేకపోతున్నాడు.

ఎండ మండిస్తోంది. కాని ఆ రేకుల సెడ్డుకింద నుంచి కదలడం లేదు. అతని కళ్ళు ప్లాట్‌ఫారం అంతా పచార్లు చేస్తున్నాయి. వచ్చే అన్ని రైళ్ళూ అతనికి బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌లాగే కనిపిస్తున్నాయి. వీస్తున్న వేడి గాలుల మీద, మండిస్తున్న గాడ్పుల మీద దృష్టిలేదు. రైలు రావడానికి యింకా చాలా వ్యవధి ఉంది. వెళ్ళి ఏదైనా తాగి వద్దామన్నాను.

"ఈలోగా రైలు వచ్చేస్తే?" అన్నాడు.

"ఇంకా టైంకాలేదు" అన్నాను.

"నాకు టైం కాలేదు" అన్నాను.

"నాకు ఆకలి లేదు. దాహం లేదు. ఓ సిగరెట్టుందా?"

అక్కడి నుంచి కదలడం అతనికి యిష్టంలేదు. అక్కడ నిలబడ్డం నాకు చాతకావడం లేదు. కొంతసేపయాక మాటమార్చి "ఓసారి మొహం కడుక్కోకూడదూ?" అన్నాను.

"ఏం దుమ్ముగా ఉందా?"

"వేడితో ఉడికిపోయినట్టుంది"

"మరేం ఫరవాలేదు" గడ్డంలోకి వేళ్ళుపోనిస్తూ, నేలని చూస్తూ కాలివేళ్ళను చూసుకున్నాడు. నేను మౌనంగా నిలబడ్డాను. కాస్సేపాగి "సరే పదండి. నా బట్టలు కూడా మాసిపోయాయి కదూ?" అన్నాడు.

అవునన్నాను.

ఇద్దరం మెట్లెక్కుతున్నాం. అక్కడా జనం ఉన్నారు. జనం తోసుకు తోసుకు వస్తున్నారు. ఎదురుగా ఎవరినో చూసి హఠాత్తుగా ఆగిపోయి నా వెనక్కు వచ్చాడు. దాగొన్నట్లు ముఖాన్ని రుమాలుతో కప్పుకున్నాడు.

మేం నిమ్మరసం తాగుతున్నాం. చెమటతో పాటు అతని చెక్కిళ్ళమీద నుంచి కన్నీళ్ళు జారుతున్నాయి. కండరాలు బిగుసుకొని పొంగాయి. రుమాలుని చేత్తో గట్టిగా పట్టుకొని ఏదో తెలీని తుఫానుని ఎదుర్కోడానికి సిద్దపడుతున్నాడు. కొంత ధైర్యాన్ని కూడదీసుకొని -

"ఈ మధ్య చాలా మారిపోయినట్లు కనిపిస్తున్నారు" అన్నాను.

"మీకెలా తెలుసు?"

"మీ ముఖమే చెప్తోంది"

"ఏం చెప్తోంది?"

"మీరేదో పెద్ద సందిగ్ధంలో ఉన్నట్లు. చాలా మందికి తెలుసా విషయం"

"ఊ" అని నిట్టూర్చాడు.

"అవును కష్టంలోనే ఉన్నాను. అయినా ఈ విషయం వాళ్ళకెలా తెలుసు. వాళ్ళకంతా తెలుసా?"

"వాళ్ళకేదో తెలుసు. కాని నిజమోకాదో నాకు తెలీడంలేదు"

నా చెయ్యి పట్టుకుని "నలుగురూ ఏమంటున్నారు?"

"రకరకాలుగా"

"అంటే?"

"మీకూ మీభార్యకీ సరిగ్గా పొత్తు కుదరలేదనీ మీ ఆవిడ మిమ్మల్ని వదిలిపెట్టి పోయిందనీ"

"అందరికీ తెలుసా ఆ విషయం?"

"దాదాపు అందరికీ తెలుసు" – కాసేపు నిశ్చేష్టుడయి ఉండిపోయాడు. ఆ తరువాత అన్నాడు. "రైలు వచ్చే టైమయిందనుకుంటాను"

"లేదు. ఇంకా గంటన్నర టైముంది. ఇక్కడ కూర్చుని ఏం లాభం? బయటికెక్కడికయినా పోదాం" అన్నాను.

"ఈ వేడిలోనా?"

తనకు తెలిసిన వారెవరయినా కంటబడతారని ఆయన భయపడుతున్నాడేమో అనుకొన్నాను. అందుకోసమే బయటికి రావడం యిష్టంలేదేమో.

హఠాత్తుగా అడిగాడు. "మీ దగ్గర సిగరెట్టుందా?"

సిగరెట్టు యిచ్చాను.

"సిగరెట్టు కాదు – నేను పొటాషియం సైనైడ్ తీసుకోవాలి. తీసుకుంటే – ఏ బాధా లేకుండా నిజంగా చచ్చిపోతానంటారా?"

"ఎందుకు ఆత్మహత్య గురించి ఆలోచిస్తున్నారు?"

"బ్రతికి నేను చెయ్యాల్సిందేముంది కనక? ఎవరికోసం బతకాలి. భార్య పోయింది. ఇల్లు సర్వనాశనమయింది. పరువు, ప్రతిష్ఠా మంట కలిశాయి. అన్ని విధాలా నాశనమయ్యాను"

"కనీసం మీ పిల్లలకోసమయినా బతకాలి. భగవంతుడిచ్చిన వరం వాళ్ళు"

నామాట పూర్తికాకుండానే వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించాడు.

"పిల్లల్ని రాజకుమారుల్లాగ పెంచాను. ఇవాళ వాళ్ళు బంధువుల దయాదాక్షిణ్యాల మీద బతుకు వెళ్ళబుచ్చుతున్నారు. వాళ్ళ మంచి చెడ్డలు చూసేనాథుడు కూడా లేడు"

అంతలో నవ్వుతున్నాడు. అంతలో నిట్టూరుస్తున్నాడు. వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోతున్నాడు. సిగరెట్టు పొగలాగ–నోరంతా దుఃఖాన్ని నింపుకొని బయటికి వదులుతున్నాడు.

రెండుమూడు కన్నీటి చుక్కలు–మళ్ళీ నిట్టూర్పు–మళ్ళీ అదే నిర్వేదం.

"నన్ను నమ్మండి. నన్ను చూడగానే–నా సైకిలు బెల్లు వినిపించగానే నా దగ్గరికి పరుగున వచ్చే నా పిల్లలు యివాళ–యిల్లు లేకుండా ఉన్నారు. దీనికంతటికీ కారణం ఆవిడే. రోజుకో రూపాయి యిచ్చేవాడిని వాళ్ళ చిల్లర ఖర్చులకి. ఆ రోజులు వెళ్ళిపోయాయి. మళ్ళీ ఎప్పుడయినా వస్తాయా అనిపిస్తుంది. ఈ మధ్య ఓ బంధువు పెళ్ళికి పిల్లలొచ్చారు. అంతా ఆనందంగా ఉన్నారు. కాని నా కొడుకు–నన్ను పక్కకు తీసుకెళ్ళి ఒక్క అణా అడిగాడు బఠాణీలు కొనుక్కోడ్డానికి"

భోరుమన్నాడు.

"ఆ పిల్లలకి తల్లిప్రేమ దక్కే అదృష్టం లేదు. తల్లి మమత తెలీకుండా వీళ్ళెలా పెరుగుతారు? పెద్దవాళ్ళవుతారు? ఆడుతూ పాడుతూ ఆరోగ్యంగా ఉండాల్సిన ఈ పిల్లలు–

కట్టెపుల్లల్లాగ, ఎవరికీ అక్కర్లేని గాలి పడగల్లాగ తయారవుతారు. డబ్బుల్లేకపోతే ఎవరూ నీవేపు కన్నెత్తి చూడనయినా చూడరు. చుట్టాలు చుట్టాలే. సొంత అన్నయ్యయినా డబ్బులేని వాడిని చిన్నచూపు చూస్తాడు. మా అన్నయ్య నెలకి వెయ్యి పైన సంపాదిస్తాడు. కాని ఆ యింట్లో నా పిల్లల గతి యిది."

"మీ పరిస్థితి అంతకంటే మెరుగ్గాలేదు"

"ఎలా ఉంటుంది? నా తిండికి ఓ పద్ధతి అంటూ లేదు, ఉండే చోటులేదు.... నిద్ర లేదు. ఆకలి లేదు. నా పిల్లల కోసం ఇరవై నాలుగు గంటలూ మధనతోనే సరిపోతోంది"

"ఏమయినా తింటారా?"

సమాధానం చెప్పేలోగానే రొట్టె, వెన్న ఆర్డరిచ్చాను.

రొట్టెమీద వెన్న రాస్తున్నాడు. మళ్ళీ అతని మనస్సు గడచిన కాలంవేపు పోయింది. తనలో తాను అనుకొన్నట్లు చెప్పడం ప్రారంభించాడు.

"మేం విడిపోవడం మమ్మల్ని సర్వనాశనం చేసింది. ఓ తుఫాను వచ్చినట్లు మేం లాహోరు నుంచి చెదిరిపోయాం. ఉద్యోగం కోసం ఊరూరా తిరిగాను. ప్రతీచోట పోటీ. ఉద్యోగాలకి రికమండేషన్లు కావాలి. నా కలలు కరిగిపోయాయి. నాకు భార్యాబిడ్డలున్నారు. నన్ను నేనే ఓదార్చుకొని మళ్ళీయింటిని తీర్చిదిద్దుకోవాలనుకున్నాను. వాళ్ళు మెల్లగా నా చేతుల్లోంచి జారిపోతున్నట్లనిపించింది. అంతా ఖర్మ–ఖర్మ–మీకు దేవుడంటే నమ్మకం ఉందా?"

"తప్పకుండా"

"నేనూ ఒకప్పుడు నమ్మేవాడిని. ఇప్పుడు కాదు"

"అంటే–మీకు దేవుడు అవసరార్థం కలిసే స్నేహితుడిలాంటి వాడన్న మాట?"

సమాధానం చెప్పలేదు.

రొట్టె, పళ్ళు ఉన్న ప్లేటు అందించాను. చూసే ప్రతీదీ ఏదో పాతకథని బయటికి తవ్వితోంది. ఇంతవరకూ వచ్చాక–మిగతా కథ చెప్పకుండా ఉండలేకపోయాడు. అన్నాడు: "లాహోరులో మే వెళ్ళని పార్టీ లేదు. గవర్నరు పార్టీకి కూడా హాజరయ్యే దక్షిణాది కుటుంబం మాదొక్కటే. ఎంతో పరపతి, హోదా, ఎందరో మిత్రులూ. నేను పదిమందిలో ఒకడిని. నాకు లేనిదంటూ లేదు. యిప్పుడు–యిప్పుడు నన్ను తెలిసిన మనిషి ఎవరయినా కంటబడితే గుండె ఒక్కక్షణం ఆగిపోతుంది. ఎవరిని చూసినా మొహం చెల్లదు. ప్రతీక్షణం భయం. ఎవరయినా నోరెత్తి నా కుటుంబం గురించి అడుగుతారేమోనని కుమిలిపోతుంటాను. మనం మెట్లెక్కుతున్నప్పుడు నాకు తెలిసిన పాతముకం కనిపించింది.

అతను మంచి రోజుల్లో నాకింద కొన్నాళ్ళు పనిచేశాడు. యివాళ ఓ పేరుమోసిన పత్రిక ఎడిటరు. ఆయన కింద పనిచేయడానికి సిద్ధపడినా యివాళ నాకు ఎవరూ యివ్వరు.

"నాకీ వూళ్ళో చాలామంది మిత్రులున్నారు. చాలా మంది పెద్ద పెద్దవాళ్ళని తెలుసు. కాని ఏం లాభం? నా దరిద్రపు ముఖాన్ని వాళ్ళకెలా చూపడం? నన్ను చూసి

నవ్వుతారు. నా గురించి గుసగుసలు చెప్పుకుంటారు".

"ఎందుకలా సెన్సిటివ్ అవుతారు. నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడుకొంటారు. అది లోక సహజం. మీ జీవితం ఎందుకిలా సర్వనాశనం చేసుకొంటారు?"

"ఆలోచించడం కూడా ఒక నేరమేనన్న మాట?" ఎదురు ప్రశ్న వేశాడు. బహుశా మాట మార్చడానికేమో. "కాఫీ ఇంకా ఉందా" అనడిగాడు.

కాఫీ తాగుతూ చెప్పాడు. "ఒకరోజు నా మీద నాకే విసుగుపుట్టి యింక ఒక్క క్షణమయినా బతకలేననిపించింది. ప్రతివాళ్ళు నాలుగు కళ్ళు పెట్టుకుని నన్ను చూస్తున్నట్టు అనిపించింది.

"ఆ దౌర్భాగ్యుడి పెళ్ళాం లేచిపోయింది. వీడికి పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోవడం కూడా తెలీదు" అని నాతో అంటున్నట్టనిపించింది. మా బిల్డింగ్ డాబామీదికి పిచ్చివాడిలాగ ఎక్కాను ఆత్మహత్య చేసుకోడానికి. సాయంకాలం ఎవరూ చుట్టూలేరు. కిందకి దూకెయ్యబోయాను. నా పిల్లలు గుర్తుకొచ్చారు. పిల్లలు" అని మళ్ళీ కంటతడిపెట్టడం ప్రారంభించాడు. "వాళ్ళనెక్కడ ఉంచి పోవాలి. ఆత్మహత్య పాపమా. పాపమయితే బతకడం పుణ్యమేం కాదు" అన్నాడు.

"ఆత్మహత్య పిరికివాడి ఓదార్పు. అది సంపాదించడానికి మనిషి చచ్చిపోవాలి"

"బతకాలని లేకపోతే ఎందుకు బతకాలి"

"బ్రతకడం చావడం మన చేతుల్లో ఉందంటారా?"

"ఈ పిచ్చి వేదాంతం వదిలిపెట్టండి. మరో సిగరెట్టిస్తారా?" "యింకా రైలు రావడానికి ఎంత టైముంది?"

వాచీ చూసి – "యింకా రెండున్నరే అయింది" అన్నాను.

"మీ వాచీ చాలా బాగుంది. ఎంతయిది?"

"700 రూ.లు"

"ఎప్పుడు కొన్నారు?"

"యివాళ పొద్దుటే, యివాళ మాపెళ్ళిరోజు. మాఆవిడ కొనిపెట్టింది, ప్రెజంట్"

"ఓహ్! ఎన్నాళ్ళయింది మీకు పెళ్ళయి?"

"రెండేళ్ళు"

వివాహ జీవితం ఎలా ఉంది?"

"బ్రహ్మాండంగా! ఇంతకాలం ఎందుకు పెళ్ళిచేసుకోకుండా ఉండిపోయానా అనిపించింది పెళ్ళయ్యాక".

అనుకోకుండా నా మొహం మీదకి సిగరెట్టు పొగ వదిలాడు. అంతలో పిడికిలి బిగించి వేళ్ళను రాసుకోవడం ప్రారంభించాడు వాటిని పరీక్షిస్తున్నట్టు.

"ఎన్నాళ్ళయింది మీకు పెళ్ళయి" అడిగాను.

"మార్చికి పదేళ్ళవుతుంది. చాలా ఆలశ్యంగా పెళ్ళి చేసుకున్నా"

"దేశమంతా ఆ పని, ఈ పనీ చేస్తూ తిరిగాను. ఎన్నో పేపర్లలో పనిచేశాను. ఎక్కడా నిలకడగా ఉండలేకపోయాను. స్థిరంగా ఉద్యోగం దొరికేసరికి పెళ్ళి చేసుకొనే వయస్సు మించిపోయింది"

"లాహోరులో పెళ్ళి చేసుకున్నారా? ఆవిడ దక్షిణాది అమ్మాయా?"

"అవును. తంజావూరమ్మాయి."

"అడుగుతున్నందుకు ఏమీ అనుకోకండి. ప్రేమ వివాహమా?"

"లేదు. ఓ విధంగా అడ్వర్టయిజ్‌మెంట్ పెళ్ళి. బ్రహ్మచారిగా బతికి బతికి విసిగిపోయి వధువు కావాలని పేపర్లో ప్రకటన వేశాను. చాలామంది ఉత్తరాలు పంపించారు. కాని నా ఫ్రెండ్స్ ఈ అమ్మాయిని సెలక్టు చేశారు. అప్పుడు ఆవిడ వయస్సు 20, 21 ఉంటుంది. ఆవిడ కుటుంబం బీదరికంలో మునిగితేలుతోంది. ఒక నికరాదాయం లేదు. ఫిల్ములో ఎక్స్ట్రాగా ఉండేది. నెలకి 20, 30 వచ్చేవి. పాటలు బాగా పాడేది. మీకు తెలుసా? పాటలంటే నేను చెవి కోసుకుంటాను"

"నేను పెళ్ళి చేసుకొనేటప్పటికీ ఆవిడ దగ్గర ఒక్క పైసా లేదు. ఇవాళ కనీసం పదివేల నగలయినా ఉంటాయి. ఎప్పుడు ఏది కావాల్సినా లేదనకుండా యిచ్చేవాడిని. ఇప్పుడదంతా పోయింది. పదివేలు కాలువలో పోసినట్టు"

"ఏం"

"తన రోజు గడవడానికి అదంతా అమ్ముకొని ఉంటుంది"

"అసలు ఆస్థితికి ఎందుకు రావలసి వచ్చింది?"

"బంగారంతో తూచేంత దేవకన్యేంకాదు ఆవిడ. బతకడానికి ఖర్చయి ఉంటుంది. నేను ఆవిడకి యివ్వనిదేదీ లేదు. ఇల్లిచ్చాను. పరపతినిచ్చాను. అన్నీ యిచ్చాను. కాని ఆడది ఆడదే. మట్టి పురుగులు మట్టిలోనే ఉండాలి. మట్టిలో ఉన్నదాన్ని లేవదీసి మనిషిని చేశాను. కాని యివాళ సీతాకోక చిలకలాగ రెపరెపలాడుతోంది. ఇద్దరు పిల్లల తల్లి. కానీ తన ప్రవర్తనకి సిగ్గులేదు" – హఠాత్తుగా ఆగిపోయాడు.

గొంతులో క్రోధం నిలదొక్కుకుంటోంది, మళ్ళీ అడిగాడు.

"ఈ విషయం అందరికీ తెలుసా?"

"దాదాపు అందరికీ తెలుసు"

కాస్త గాభరా పడ్డాడు. గోడకి ఉన్న రైల్వే టైంటేబులువేపు తలతిప్పాడు. నేను పత్రిక తెరిచాను. మరి కాస్సేపయాక నావేపు తిరిగి.

"మరో సిగరెట్టు యివ్వండి" అన్నాడు.

గదంతా రెండుమూడు సార్లు పచార్లు చేసి ఓ కుర్చీ లాక్కొని నా పక్కన కూర్చున్నాడు.

"ఆ పేపరలా పారెయ్యండి. అది చదివితే ఏమొస్తుంది. ఎందుకిలా జరిగిందో చెప్పగలరా?

"ఏం సమాధానం చెప్పమంటారు? ఏముంది చెప్పడానికి?"

"వయసులో తేడావల్లా?"

"కావచ్చు"

"బహుశా దీనికంతటికీ ఓ విధంగా నేనూ కారణమేమో. దేశ విభజన జరిగాక ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకొని లాహోరు వదిలిపెట్టాల్సి వచ్చింది. అప్పుడే ఆవిడ మనస్సు మారిందేమో"

"అయినా కావాలని ఆవిడని అక్కడ వదిలి పెట్టలేదుగా, పోనీ కావాలని వదిలారే అనుకోండి. యిలా ప్రవర్తించాలి అని ఎక్కడుంది?"

"ఓ చిన్న యిల్లుని అద్దెకి తీసుకున్నాను. వాళ్ళకోసం. అదిగో అప్పుడే ఆ రౌడీ – ఆవిడతో కలిసి బతకడం ప్రారంభించాడు. అతను నా బంధువు. అక్కడే ఉండడానికి నేనేం అభ్యంతరం చెప్పలేదు. ఆవిడకంటె అతను రెండేళ్ళు చిన్న కాని ఆవిడ అతని వలలో పడిపోయింది"

కొంతసేపయాక మళ్ళీ చెప్పాడు.

"లాహోరులో ఉన్నంతకాలం ఆవిడ గురించి వేలెత్తి చూపడానికేం లేదు. ఆవిడ పాడాలన్నా అక్కడా అవకాశం లేదు. ఎప్పుడూ అనుమానించనయినా అనుమానించలేదు. ఇంటికి ఎవరు వచ్చినా ఆవిడని పొగిడేవారు. కాని ఆ రౌడీని పట్టుకు ఎందుకు వేలాడుతోందో నాకర్థం కావడంలేదు. వయస్సు మళ్ళాక ముసలితనంలో మద్రాసులో ఉండాలని కలలు కనేవాడిని. నేను సంపాదించినదంతా పోగుచేసి ఓ చిన్న యిల్లు కట్టాను. ఇప్పుడా యింట్లో ఏ దయ్యాలున్నాయో నాకు తెలీదు. ఇంతవరకు దానిలో ఎవరూ ఒక రోజయినా ఉండలేదు. ఇవాళ – యివాళ నాకు పరువులేదు. శాంతి లేదు. ఆ యింటివేపు వెళ్ళాలన్నా వణుకు పుడుతుంది. రాత్రీ పగలూ ఆఫీసులోనే గడిపేస్తుంటాను. ఆ యింటికి ఎలా వెళ్ళను. నా బిడ్డల తియ్యని గొంతు ఇంకా ఆ యింట్లో ప్రతిధ్వనిస్తోంటే నాకు పిచ్చెక్కుతుంది."

మళ్ళీ కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చున్నాం.

"టైమెంతయింది?"

"3.25. రైలు రావాలి"

ఇద్దరం ప్లాట్‌ఫారం మీదికి పరిగెత్తాం. బోర్డుమీద ఎక్స్‌ప్రెస్ అరగంట లేటుగా వస్తుందని రాసి ఉంది. ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొనుక్కుని అక్కడే తిరుగుదామన్నాను.

"ఎందుకూ! యిక్కడే నిలబడదాం"

సిగరెట్టు పొగ వదులుతూ అన్నాడు. "ఈ మధ్యే కలకత్తానుంచి ఉత్తరం వచ్చింది. ప్లేన్‌లో బెంగుళూరు వస్తున్నానని, నన్ను ఎయిర్‌పోర్టులో కలవమంది. ఆవిడని కలుసుకోవడానికి ధైర్యం చాలలేదు"

"వెళ్ళాల్సింది" అన్నాను.

"నా దగ్గరికి రమ్మని రాశాను. లేకపోతే ఆవిడకీ నాకూ సంబంధంలేదని పత్రికలో

వేస్తానన్నాను. ఉత్తరం అందాక రావడానికి ఒప్పుకుంది. ఎందుకు ఒప్పుకుందో తెలుసా? దగ్గర చిల్లిగవ్వలేదు" అంతలో హఠాత్తుగా అన్నాడు.

"ఆడది ఒకసారి పొరపాటు చేస్తే జీవితమంతా పొరపాట్లు చేస్తుందంటారా?"

"కొందరు చెయ్యరు. కొందరు వయస్సు మళ్ళాక తప్పు దిద్దుకుని మంచిదారికి వస్తారు. కొందరు ఆ జీవితానికి అలవాటు పడిపోతారు. ఆవిడని వెనక్కి తీసుకురావాలని మీరు నిశ్చయించుకొన్నట్లు కనిపిస్తుంది"

"అవును. పిల్లలు పసివాళ్ళు. ఎవరో వార్ని ఆలనా పాలనా చూడాలి. నేను ఒక్కడినే అయితే ఆ దౌర్భాగ్యురాలికి ఓ పాఠం చెప్పేవాడిని. నా సంబంధాలు దానితో ఎప్పుడో తెగిపోయాయి. కాని నా పిల్లలు తప్ప నాకిప్పుడు మరో ప్రపంచం లేదు"

ఈలోగా రైలు రావడం కనిపించింది.

"అదేనా బెంగుళూరు ఎక్స్‌ప్రెస్?"

"అవును" అన్నాను.

అతను వణకడం ప్రారంభించాడు-కళ్ళనీళ్ళు తిరిగాయి. నడుస్తున్నాడు. "వస్తుందా?"

"రైలు ఎలాగూ వచ్చింది. చూద్దాం"

"మీరావిడను గుర్తుపట్టగలరు కదూ?" అడిగాడు.

"ఆ! ఒకటి రెండుసార్లు చూశాను" అన్నాను.

"అయితే మీరూ ఆవిడకోసం చూడండి"

తలగోక్కుంటూ - ప్లాట్‌ఫారం మీదికి పరిగెత్తాడు. కాలి మునివేళ్ళ మీద నిలబడి-రైలు దిగుతున్న ప్రయాణీకుల్ని గమనిస్తున్నాడు. రైలు దిగిన ప్రతిస్త్రీని గుచ్చి గుచ్చి చూస్తున్నాడు. ఒక గేటునుంచి మరో గేటుకి నడుస్తున్నాడు. ఎంతో సేపయ్యాక నిరాశతో కృంగిపోతూ రాలేదని చెయ్యి ఆడించాడు.

"ఒక్క క్షణం ఆగుదాం. ఇంకా ప్రయాణీకులు వస్తున్నారు కదా!"

అనుమానం వచ్చి టిక్కెట్టు ఎగ్జామినర్‌ని అడిగాడు. "ఇదేనా బెంగుళూరు ఎక్స్‌ప్రెస్"

విసుగ్గా ఉద్యోగి అన్నాడు. "లేకపోతే! రంగూన్ వెళ్ళే విమానం అనుకొన్నారా?"

ప్రయాణీకుల రద్దీ తగ్గింది. చాలామంది బయటికి వెళ్ళారు. నాకు దగ్గరగా వచ్చాడు.

"అంతా అయిపోయింది. ఆఖరి ఆశ కూడా రాలిపోయింది. నా పిల్లల గతి ఏమవుతుందో తెలీడం లేదు"

"ఆవిడ వస్తారు. బాధపడకండి. ఇంకా చాలా మంది ప్రయాణీకులున్నారుగా. మీకోసం ఎదురు చూస్తోందేమో. వెళ్ళి చూద్దాం పదండి"

"ప్లాట్‌ఫారం మీదకా? - వద్దు వద్దు. నేను రాలేను. ఆ దుర్మార్గుడు-వాడు ఆమెతో ఉండవచ్చు"

"అయితే మీరిక్కడే ఉండండి. నేను చూసి వస్తాను."

రైలంతా పెట్టి పెట్టీ వెదుకుతూ నడుస్తున్నాను. కూలీల కోసం వెదికే ప్రయాణీకులు అక్కడా అక్కడా ఉన్నారు. కాని ఆవిడలేదు. వెనక్కి తిరిగాను. అనుకొన్నాను. యిప్పుడేం చేస్తాడు. ఏం చెయ్యగలడు? పిచ్చివాడవుతాడా? ఆత్మహత్య చేసుకుంటాడా? పిల్లలు? ప్రపంచం? ఆశలు?

"రాలేదా?" అడిగాడు ఆత్రుతగా.

ఓదారుస్తూ "రేపు రావచ్చు" అన్నాను.

నా చెయ్యి పట్టుకున్నాడు. ఆకులాగ వణుకుతున్నాడు. నా భుజానికి చేరబడి నిలబడ్డాడు. చెమటలు కారుతున్నాయి. సిగరెట్టు తీసి యిచ్చాను. తీసుకోలేదు.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు మెల్లగా.

"ఆవిడ తప్పక వస్తుంది. కాని మీరు బెంగుళూరు వెళ్తే బాగుండేదని నాకనిపిస్తుంది".

"ఎందుకురాదు? రాక ఎక్కడికి పోతుంది? గూటికి అలవాటుపడిన పక్షులు ఎప్పటికయినా గూడు చేరాల్సిందే. ఆకాశం చాలా విశాలమయింది. కాని తలదాచుకోడానికి చోటు లేదు".

"కాని పక్షులు ఒక్కొక్కప్పుడు వేటికవి వేర్వేరుగా గూళ్ళు కట్టుకుంటాయి. తను తిరిగి రాదు. నాకు తెలుసు. శాశ్వతంగా ఎగిరిపోయింది."

కొంతసేపాగి మళ్ళీ అన్నాడు. "బహుశా తనదగ్గర బంగారం ఇంకా ఉందేమో, ఆ గూండా ఏం చేశాడో తెలీదు"

స్టేషను దాటి బయటికొచ్చాం. అదే రద్దీ. అవే బస్సులు, కార్లు, అదే గోల– ప్రతీవాడు తనదారిని తాను కదలిపోతున్నాడు.

రోడ్డు మలుపుదగ్గర – పెళ్ళి ఊరేగింపు వస్తోంది. ముందు నాదస్వర మేళం. ఆ శబ్దంతో ఆకాశం దద్దరిల్లుతోంది. అటుచూసి తన రుమాలు తీసి – నోరు మూసుకుని – నా భుజం మీద ఆనుకున్నాడు.

గాభరా పడ్డాను. ఏమిటి జీవితం? పక్కవాడికేం జరుగుతోందో ఎవడు పట్టించుకుంటున్నాడు? వీళ్లకి – అవును – ఇలాంటి వాళ్ళకి దేవుడే దిక్కు.

(న్యూయార్కు హెరాల్డ్ ట్రిబ్యూన్ పోటీలో బహుమతి పొందిన ఆరికెపూడి రమేష్‌చౌదరిగారి కథానికకి ఇది అనుసరణ)

(ఆంధ్రభూమి వీక్లీ *11.8.1977*)

------